
ప్రజాశక్తి
బుధవారం 15 ఏప్రిల్ 2024




తహశీల్దార్లకు తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-పాలకొండ

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఇవిఎంలు, వివి ప్యాట్లను పార్వతీపురంలో అప్పగించి పాలకొండ, సీతంపేట తహశీల్దార్లు వరహాలు, మహేశ్వరరావు కారులో పాలకొండ వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు టైరు పాలకొండ మండలం రాజుపేట కూడలికి దగ్గరకు వచ్చేసరికి పేలి ప్రమాదం జరిగింది. అదే సమయానికి ఎన్నికల విధులు ముగించుకుని అటుగా వస్తున్న పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు ప్రమాదాన్ని గుర్తించి కారులో చిక్కుకున్న ఇద్దరు తహశీల్దార్లను వెంటనే బయటకు తీశారు. గాయాలపాలైన ఇద్దరు తహశీల్దార్లను వెంటనే పాలకొండ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.

ఇవిఎంల్లో అభ్యర్థుల భవితవ్యం



- యువత, ఉద్యోగులు, వలస కుటుంబాలే కీలకం
- స్ట్రాంగ్ రూములకు చేరిన ఇవిఎంలు
- 4న ఓట్ల లెక్కింపు
- కూడికలు.. తీసివేతల్లో ప్రధాన పార్టీల నాయకులు
- జిల్లాలో 77.10శాతం పోలింగ్ నమోదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉంది. ఓటరు ఇచ్చిన తీర్పు జూన్ 4న వెలువడనుంది. ఇవిఎం బాక్సులన్నీ మంగళవారం మధ్యాహ్నానికి కట్టుదిట్టమైన బందోబస్తు నడుమ జెఎన్‌టియు ఇంజినీరింగ్ వర్శిటీ, జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కాలేజీలోని రిషప్షన్ కేంద్రాలకు పూర్తిస్థాయిలో చేరాయి. బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాల ఓట్లు జెఎన్‌టియులోను, మిగిలినవి లెండి కాలేజీలోనూ భద్రపరిచారు. కౌంటింగ్ రోజున విజయనగరం లోక్‌సభ ఓట్ల వివరాలు కూడా లెండీలోనే ప్రకటిస్తారు. పార్వతీపురం మన్యంలోని పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల కౌంటింగ్ పార్వతీపురంలోని ప్రభుత్వ ఉద్యాన కళాశాలలో జరుగుతాయి. ఇవిఎంలు కూడా అక్కడికే తరలించి భద్రపర్చారు. పోలింగ్ ముగిసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీలో ఉన్న అభ్యర్థులు మంగళవారం సమావేశాలు ఏర్పాటు చేసుకొని గ్రామాలవారీగా ఓట్ల సరళిని బట్టి అంచనాలు వేశారు. ముఖ్యంగా ప్రాధాన పార్టీలుగావున్న వైసిపి, టిడిపి అభ్యర్థులు, వారి తరపున ఎన్నికల్లో పనిచేసిన నాయకులు కూడికలు, తీసివేతలలో తలమునకలయ్యారు. బూత్‌ల వారీ వివరాలు రప్పించుకొని, ఏ కేంద్రంలో తమ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి. ప్రత్యర్థికి వచ్చే ఓట్లు ఎన్ని బేరీజు వేసుకుంటున్నారు. ఒకటికి పదిసార్లు అంచనాలు వేస్తున్నారు. ఎవరికి వారే దీమాలు వ్యక్తం చేసుకుంటున్నారు. నియోజకవర్గాల వారీగా ఎన్ని ఓట్లు పోలయ్యాయనేది మంగళవారం రాత్రి వరకూ తేలలేదు. అంచనాలు వాటిపైనే ఆధావడివుండడంతో రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు వాటికోసం కళ్లు కడగండ్లు కాసేలా ఎదురు చూశారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్య గట్టిపోటీ కనిపిస్తోంది. వివిధ సంక్షేమ పథకాలు అందుకున్న మహిళలు, పింఛన్లు అందుకున్న వృద్ధులు, వికలాంగులు, వింతవులు తమకే ఓట్లు వేశారన్న ఆశాభావం వైసిపి నాయకుల నోట వినిపిస్తోంది. కానీ, ఈ ఎన్నికల్లో యువకులు, అందులోనూ కొత్త ఓటర్లు, ఉద్యోగులు, నిరుద్యోగులు, వలసకుటుంబాల ఓట్లు గెలుపు, ఓటములను నిర్ధేశించనున్నాయి. వీటిలో ఎక్కువగా టిడిపికి పడడ్డాయనేది ఆ పార్టీ నాయకులు విశ్వసిస్తున్నారు. ఈసారి సుదూర ప్రాంతాల్లోవుంటున్న వలస ఓటర్లు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు వీరిని రప్పించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ ఓట్లు ఎవరికి వేశారన్నది అనుమానమే.

అరుకు పార్లమెంటుకు 73.68శాతం పోలింగ్ నమోదైంది.
నియోజకవర్గాల వారీగాపోలింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
పాలకొండ	1,95,020	1,46,781	75.26
కురుపాం	1,94,114	1,52,450	78.54
పార్వతీపురం	1,89,817	1,48,502	78.23
సాలూరు	2,04,489	1,56,331	76.45
అరుకు	2,45,489	1,74,588	71.12
పాడేరు	2,48,387	1,58,747	63.91
రంపచోడవరం	2,77,317	2,08,025	75.01

పార్వతీపురం మన్యం జిల్లాలో 77.10శాతం పోలింగ్ నమోదైంది.
నియోజకవర్గాల వారీగాపోలింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
పాలకొండ	1,95,020	1,46,781	75.26
కురుపాం	1,94,114	1,52,450	78.54
పార్వతీపురం	1,89,817	1,48,502	78.23
సాలూరు	2,04,489	1,56,331	76.45

స్ట్రాంగ్ రూముల్లో ఇవిఎంలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మన్యం జిల్లాలో స్ట్రాంగ్ రూంలకు సీల్ పడింది. స్ట్రాంగ్ రూంలను అత్యంత భద్రత మధ్య ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేశారు. సోమవారం పోలింగ్ అనంతరం ఉద్యాన కళాశాల వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాలకు జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల నుంచి ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి చేరుకుంది. ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి వచ్చిన ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి పూర్తి స్థాయిలో పరిశీలించి రిటర్నింగ్ అధికారులు, వారి సిబ్బంది తీసుకున్నారు. అన్ని ప్రక్రియలు పూర్తయిన తర్వాత మంగళవారం పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్ కుమార్ మెహర్ద, పార్లమెంటరీ నియోజకవర్గ పోలీసు పరిశీలకులు నయీం ముస్తఫా మన్సూరి, వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ శోబిక, పార్వతీపురం పిఒ, సాలూరు ఆర్ఒ సి.విష్ణుచరణ్, సీతంపేట ఐటిడిఎ పిఒ, పాలకొండ ఆర్ఒ శుభం బన్సల్, పార్వతీపురం ఆర్‌డిఒ, ఆర్ఒ కె.హేమలత, పాలకొండ ఆర్‌డిఒ, కురుపాం ఆర్ఒ వి.వెంకట రమణ సీల్ వేశారు. పార్లమెంటు, శాసన సభ నియోజక వర్గాలకు వేర్వేరుగా స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూంల్లోకి వివిధ పార్టీల ప్రతినిధులు వెళ్లి పరిశీలించిన అనంతరం సీల్ వేశారు. పార్టీల ప్రతినిధులు సీల్ పై సంతకాలు చేశారు.

స్ట్రాంగ్ రూంలకు మూడంచెల భద్రత, బందోబస్తు కల్పించారు. మొదటి స్థాయిలో స్థానిక పోలీసులు, రెండో స్థాయిలో రాష్ట్ర సాయుధ బలగాలు, మూడో స్థాయిలో కేంద్ర సాయుధ బలగాల పహారా ఏర్పాటు చేశారు. రేయింబవళ్లు పహారాతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. అంతకుముందు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, వాటి భద్రత తదితర విషయాలను జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి రోజు వచ్చి స్ట్రాంగ్ రూంలను పరిశీలించవచ్చని కలెక్టర్ తెలిపారు. వారికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని, వారికి నేరుగా ప్రవేశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో ప్రశాంతంగా సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించిన రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్ కుమార్ మెహర్ద మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. స్వయంగా అనేక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలు పరిధిలో జరిగిన సరళిని పరిశీలించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఎస్డిసి ఆర్‌వి సూర్యనారాయణ, అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఎఎస్‌పి సునీల్ షరోన్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇవిఎం స్టోర్ రూంకు దగ్గరుండి సీల్ వేయిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్



- పోలింగ్ సిబ్బంది రెమ్యునరేషన్‌లో కోత
- ఊసురోమన్న ఉద్యోగులు
- ఉపాధి కూలీయే నయమంటూ ఆవేదన
- భోజనాలూ అరకొరే..

అరకోటి హాంఫట్!

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల సిబ్బందికి ఇచ్చే రెమ్యునరేషన్‌లో అధికారులు కోతపెట్టారు. ఇలా కోతపెట్టిన మొత్తం వ్యాప్తంగా సుమారు రూ.50 లక్షలు వరకు హాంఫట్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు రోజులుపాటు శిక్షణ, మరో మూడు రోజులు పాటు పోలింగ్, ఇవిఎంల అప్పగింత పనులు చేసిన సిబ్బందికి కుచ్చుటోపీ పెట్టారు. ఈనేపథ్యంలో అధికారుల తీరుపై ఉద్యోగులు మండిపడు తున్నారు. ఉద్యోగులకు అరకొర మొత్తం చేతిలో పెట్టి ఇళ్లకు పంపడంపట్ల జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

విజయనగరం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సుమారు 13,661 మంది పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు విధులు నిర్వహించారు. వీరిలో పిఒలు 2290 మంది, ఎపిఒలు 2306, ఒపిఒలు 9065 మంది ఉన్నారు. వీరు కాకుండా సెక్టార్ ఆఫీసర్లు 225, నోడల్ అధికారులు 16 మంది, మైక్రో ఆబ్జర్వర్లు 445, బిఎల్ఒలు 1847, ఇవిఎంల స్వీకరించే సిబ్బంది 728మంది ఉన్నారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో అంతా కలిపి 6,600మంది ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహించారు. పిఒ, ఎపిఒలు మూడు రోజులు పాటు శిక్షణతో పాటు రెండు రోజులు పాటు పోలింగ్ విధులు, మంగళవారం మధ్యాహ్నం వరకు ఇవిఎంల అప్పగింతతో మొత్తంగా ఆరు రోజులు పాటు పనిచేశారు. ఒపిఒలకు శిక్షణ లేనందున మూడు రోజులు పాటు పోలింగ్ విధులు నిర్వహిస్తున్నట్లు లెక్క. పిఒ, ఎపిఒలకు రోజుకు రూ.350 చొప్పున, ఒపిఒలకు రోజుకు 250 చొప్పున చెల్లించాలని ఎన్నికల సంఘం జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. ఈ లెక్కన పిఒలు, ఎపిఒలకు ఆరు రోజులుకు టిఎ, డిఎలతో కలిపి రూ.2100, ఒపిఒలకు రూ.750 చొప్పున చెల్లించాల్సి ఉంది. కానీ అధికారులు పిఒ, ఎపిఒలకు రూ.1750, ఒపిఒలకు రూ.500 మాత్రమే చెల్లించారు.

పోలింగ్ ముగిసిన తర్వాత సెక్టోరల్ అధికారులు వారికి ఆమొత్తాన్ని చేతిలో పెట్టడంతో చాలాచోట్ల వారంతా తీవ్ర ఆవేదన చెందారు. మూడు రోజులు పాటు విధులు నిర్వహిస్తే రోజుకు రూ. 166 చొప్పున రూ.500 చెల్లించడమేమిటని ప్రశ్నించారు. వీటికి బదులు ఉపాధి కూలీయే నయమని ఆవేదన చెందారు. దీంతో అధికారులు తామేమీ చేయలే మంటూ ఆ మొత్తాన్ని సిబ్బంది చేతిలో పెట్టి వెళ్లిపోయారు. ఈలెక్కన జిల్లా మొత్తంగా రూ.38లక్షల, 74వేల, 850ను అధికారులు మింగేసినట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. మరోవైపు మిగతా సిబ్బందికికూడా చెల్లింపుల్లో కోత పెట్టినట్లు తెలిసింది. అంతేకాకుండా పోలింగ్‌రోజున పోలింగ్ బూత్‌ల్లో అందించిన నాణ్యత లేని భోజనాల్లో భారీగా వెను కేసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ లెక్కన జిల్లా మొత్తంగా సుమారు రూ.50లక్షలు వరకు హాంఫట్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో అధికారుల తీరుపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు పోలింగ్ విధులకు వెళ్లిన సిబ్బందికి ఆదివారం రాత్రి, సోమవారం సరైన భోజనాలు లేక అల్లాడిపోయారు. ఎప్పుడో తయారు చేసిన భోజన ప్యాకెట్లు ఇవ్వడం, అవి కూడా పాడవ్వడంతో పలుచోట్ల సిబ్బంది తినేందుకు ఇబ్బంది పడ్డారు. సోమవారం అర్ధరాత్రి ఇవిఎంలను తీసుకొని రిసెప్షన్ కేంద్రాలకు చేరుకున్నారు. వాటిని అక్కడ అప్పగించేందుకు సుమారు మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టడంతో రాత్రి 12 తరువాతే భోజనాలు చేయాల్సి వచ్చింది. అనంతరం స్వగ్రామాలకు వెళ్లేందుకు రవాణా సదుపాయం లేక నానా అగచాట్లు పడ్డారు.

స్వల్పంగా పెరిగిన ఓటింగ్

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలోని ఏజెన్సీ పరిధిలో గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ ఎన్నికల్లో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లో అత్యధికంగా మహిళా ఓటర్లు పాల్గొని ఓట్లు వేశారు. దీంతో ఓటింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. అధికారులు అందించిన వివరాలు ప్రకారం 2019 ఎన్నికల్లో 77.8 శాతం ఓట్లు నమోదవ్వగా ఈ ఎన్నికల్లో 78.54 శాతం నమోదైంది. నియోజకవర్గంలో 1,94,114 ఓట్లుకు గానూ 1,52,450 ఓట్లు పోలయ్యాయి. దీంతో వైసిపి శ్రేణులు మహిళా ఓట్లు ఎక్కువ పోలవ్వడంతో సంక్షేమ పథకాలు మహిళలకు అందే నేపథ్యంలో మహిళలు తమకే ఓట్లు వేస్తారని ధీమాతో ఉన్నారు. అయితే కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై మహిళలకు ఎక్కువ లబ్ది ఉన్నందున తమకే మహిళలు ఓట్లు వేస్తారని ఎవరికివారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. చివరికి రెండు పార్టీల అభ్యర్థులు గెలుపునకు కురుపాం నియోజకవర్గంలో మహిళా ఓటర్లు కీలకంగా ఉన్నారు.

తగ్గిన పోలింగ్ శాతం

పాలకొండ : 2019 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గిందని చెప్పవచ్చు. 1,95,020 మంది ఓటర్లకు గానూ 1,46,781మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.25శాతం ఓటింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో 1,84,414 ఓటర్లకు గానూ 1,36,012 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.13శాతం ఓటింగ్ నమోదైంది. గతం కంటే ఈసారి సుమారు 11,000 ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. అయితే గతం కంటే పోలింగ్ శాతం 0.1శాతం తగ్గింది. వలస ఓటర్లను పూర్తి స్థాయిలో తీసుకునిరాలేకపోవడంతో పాటు, ఎండల వేడి, ఇతరేతర కారణాలని చెప్పవచ్చు.

అంచనాల్లో మునిగిన అభ్యర్థులు

ఎన్నికలు ముగిసాయి. కొద్దిరోజులుగా కంటి మీద కునుకు లేకుండా ఎన్నికలు ప్రచారంలో ఉన్న అభ్యర్థులు మంగళవారం ఇళ్లకు పరిమితమయ్యాయి. అనుచరులతో గెలుపు, ఓటముల అంచనాలు వేసుకుంటున్నారు. వీరఘట్టం మండలం వండవలో కళావతి ఇంటికి వచ్చిన నేతలతో మాట్లాడి ఏఏ పోలింగ్ బూతులు తమకు అనుకూలంగా ఉన్నాయో, వ్యతిరేకంగా ఉన్నాయో తెలుసుకుంటున్నారు. అదే విధంగా అదే మండలంలో ఎం.రాజపురంలో జనసేన అభ్యర్థి జయకృష్ణ కూడా ముఖ్య నాయకులతో మాట్లాడి పరిస్థితిని అంచనా వేస్తున్నారు. మండలాల వారిగా తమకు ఏ విధంగా ఓటింగ్ జరిగిందనే వివరాలను తెలుసుకుంటున్నారు.

అప్పన్నపేటలో 18 గంటల పాటు పోలింగ్

తెల్లవారు జామున 3గంటల వరకు సిబ్బంది ఇక్కట్లు

ప్రజాశక్తి భోగాపురం

మండలంలోని భోగాపురం పంచాయతీ అప్పన్నపేట పోలింగ్ కేంద్రంలో (230) 18 గంటల పాటు పోలింగ్ జరిగింది. ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఇవిఎంలు మొరాయించడంతో రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. మరోవైపు సాయంత్రం ఎక్కువ మంది ఓటర్లు ఓటేసేందుకు రావడంతో పోలింగ్ సమయం ముగిసేసరికి సుమారు 5వందల మంది ఓటర్లు క్యూలో ఉండడంతో వారంతా ఓటు వేసేందుకు తెల్లవారుజామున 3గంటలైంది. దీంతో పోలింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. . ఈ పోలింగ్ కేంద్రంలో 1274 ఓట్లు ఉన్నాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి వరుసలో ఉన్న సుమారు 500 మందికి అధికారులు టోకెన్లు జారీచేశారు. పోలింగ్ కేంద్రం చిన్నదిగా ఉండడం, ఆలస్యం కావడంతో ఓటర్లంతా ఒకేసారి వెళ్లేందుకు ప్రయత్నించడంతో రద్దీ నెలకొంది. పోలింగ్ ఆలస్యం కావడంతో వైసిపి, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులు బడ్డుకొండ అప్పలనాయుడు, లోకం మాధవి పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి పరిస్థితులను పరిశీలించారు. ఈనేపథ్యంలో పిఒ ఫిర్యాదుతో తాహశీల్దార్ శ్యాం ప్రసాద్, ఎంపిడిఒ చంద్రకళ, డిప్యూటీ తాహశీల్దార్ శ్రీనివాసరావు, సిఐ కుమార్ అక్కడికి చేరుకున్నారు. పోలింగ్ కేంద్రం ప్రాంతంలో ఇతరులు ఎవరూ ఉండవద్దని, ఓటర్లు మాత్రమే ఉండాలని హెచ్చరించారు. పోలింగ్‌ను వేగవంతం చేసే ప్రయత్నం చేశారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

అర్ధరాత్రి 12 గంటలకు మరో ఇవిఎం ఏర్పాటు

అర్ధరాత్రి 12 గంటలు దాటాక తేదీ మారిపోతుండడంతో అధికారులు వెంటనే మరో ఇవిఎంను ఏర్పాటు చేశారు. అప్పటికే పోలింగ్ కేంద్రంలో మరో 70 మంది ఓటర్లు వరుసలో ఉన్నారు. అక్కడ నుంచి మంగళవారం తెల్లవారుజామున ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగింది. అనంతరం డెంకాడ మండలంలోని లెండి కళాశాలకు ఇవిఎంలను తరలించారు. అక్కడ రద్దీగా ఉండడంతో ఉదయం 11గంటల ప్రాంతంలో ఇవిఎంలను రిసెప్షన్ కేంద్రంలో అప్పగించారు.

'దొర'తనమా?.. సంధ్యా'రాణి వాసమా'

పోలింగ్ సరళిపై చర్చోపచర్చలు





ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల పోలింగ్ ముగియడంతో గెలుపు ఓటములపై చర్చోపచర్చలు మొదలయ్యాయి. సోమవారం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రశాంతంగా పూర్తయింది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎన్నికలకు సంబంధించి 76.45శాతం పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,04,489 ఓట్లుకు గాను లక్షా 56వేల 331 ఓట్లు పోలయ్యాయి. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాజన్నదొర ఐదోసారి పోటీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు ప్రచార అస్త్రాలుగా రాజన్నదొర బరిలోకి దిగారు. ఆయన ప్రత్యేకంగా హామీ లేవీ ఇవ్వలేదు. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి చెప్పుకుంటూ జనంలోకి వెళ్లారు. అయితే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాజన్నదొరపై నియోజకవర్గ ప్రజల్లో కొంత అసంతృప్తి కూడా ఉంది. అయితే ఆ అసంతృప్తి ఆయన విజయావకాశాలను ప్రభావితం చేసే స్థితిలో లేకపోవడం అనుకూల పరిణామంగా ఉంది. నాలుగు మండలాల్లో, మున్సిపాలిటీకి చెందిన పార్టీ నాయకుల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ ఆయన గెలుపు కోసం చేసిన ప్రయత్నంపై ప్రభావం చూపలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మక్కువ, పాచి పెంట, మెంటాడ, సాలూరు మండలాల్లో వైసిపికి ఆధిక్యత వస్తుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో మాత్రమే టిడిపికి ఆధిక్యత వస్తుందనే ప్రచారం జరుగుతోంది. భారీ ఆధిక్యం వస్తుందని టిడిపి నాయకులు కార్యకర్తలు అంచనా వేస్తున్నారు. పట్టణంలో టిడిపికి 6వేల ఆధిక్యత లభించినా వైసిపి గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే సంధ్యారాణిపై కొంతమంది టిడిపి నాయకుల్లో ఉన్న అసంతృప్తి ఆయన గెలుపు అవకాశాలను దెబ్బ తీస్తుందనే వాదనలు విని వినవస్తున్నాయి. టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత కూడా సంధ్యారాణి పార్టీలో ఉన్న అసమ్మతి నాయకులను కలుపుకు పోయే ప్రయత్నం చేయకపోవడం కూడా ఆమెకు ప్రతికూల ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాలుగు మండలాల్లోనూ సంధ్యారాణిని వ్యతిరేకించే నాయకులు ఆమె గెలుపు కోసం ఏమేరకు పని చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మక్కువ మండల సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావును కలుపుకు పోవాలని టిడిపి అధిష్టానం ఆదేశించినా సంధ్యారాణి ఆదిశగా ప్రయత్నం చేయలేదు. ఏజెన్సీ గ్రామాల్లో వైసిపికి ఆధిక్యత లభిస్తుండడం ఆ పార్టీ విజయానికి దోహదపడుతుందని అధికారపార్టీ నాయకులు భావిస్తున్నారు. ఐదోసారి ఎమ్మెల్యేగా రాజన్నదొర గెలుపు ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే


ప్రజాశక్తి-పార్వతపురంరూరల్

నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి అభ్యర్థులు విజయం తమదేనంటే కాదు తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 1,89,817 మంది ఓటర్లకు గాను రిటర్నింగ్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు 78.23 శాతం అంటే 1,48,502 ఓట్లు పోలైనట్లు చెపుతున్నప్పటికీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో సహా పూర్తి గణాంకాలు తెలియాల్సి ఉంది. మంగళవారం వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో పాటు టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర క్యాంపు కార్యాలయాలకు నియోజవకర్గంలోని 233 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఏజెంట్లు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరై ఫారం-17సి ఫారాలను అందజేస్తూ అభినందనలు తెలిపారు. ఎవరికి వారే ఎన్నికలపై సమాచారం అందిస్తూ పరిస్థితులు తమకే అనుకూలంగా ఉన్నాయని, గెలుపు తమదేనంటూ ఇరువురు నాయకులకూ భరోసా కల్పిస్తున్నారు. దీంతో ఇరుపార్టీలకు చెందిన శిబిరాల్లో సందడి వాతావరణం నెలకొంది. బలిజిపేట, సీతానగరంతో పాటుగా పార్వతీపురం రూరల్, మున్సిపాలిటీల్లో కూటమిలోని జనసేన కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేసి టిడిపికి ఓట్లు ఎక్కువగా పడేలా కృషి చేయడం కనిపించింది. అలాగే వైసిపి కేడర్‌కూ అన్ని గ్రామాల్లో తమ అభ్యర్థి విజయానికి అంకితభావంతో పనిచేసి ఓటర్లను బూత్‌లకు రప్పించడంలో విజయవంతమయ్యారు. అయితే టిడిపి పట్ల ప్రజలు ఆకర్షితులై, సైకిల్ హవా అన్ని మండలాల్లోనూ నడిచిందనే చర్చ కొనసాగుతుంది. పార్వతీపురం మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ టిడిపికి ఎక్కువ ఆదరణ లభించిందని చెబుతున్నారు. ఇరుపార్టీ నాయకులు ఓట్లు కొనుగోలు చేయడానికి విరివిగా డబ్బులు వెదజల్లినప్పటికీ వైసిపి నాయకులు నగదు పంపిణీ సక్రమంగా నిర్వహించలేదని, ఇచ్చిన డబ్బును నాయకులు, కౌన్సిలర్లు దిగమింగి, అక్కడక్కడా అంతంత మాత్రంగా పంచారని, దీనివల్ల పట్టణంతో పాటు మండలాల్లోని పలు గ్రామాల్లో నాయకులు నమ్మక ద్రోహానికి పాల్పడి, నగదు పంపిణీ సక్రమంగా జరగలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి వారి అనుయాయులు తీసుకెళ్లడంతో ఆయన నాయకులపై అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. నియోజకవర్గానికి అంతగా పరిచయం లేకపోయినా, సీనియర్ నాయకుల సహకారం లేకపోయినా టిడిపి అభ్యర్థి తనదైన శైలిలో వ్యూహాలను రచిస్తూ, కూటమిలోని నాయకులను, యువతను కలుపుకుని నియోజకవర్గంలో పార్టీ ఉనికిని నిలబెట్టారని టిడిపి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇరువురు అభ్యర్థులు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ పోలింగ్ జరిగిన తీరును చూస్తుంటే ఫలితం టిడిపికి అనుకూలంగా ఉండే అవకాశాలు అధికంగా ఉన్నాయని రాజకీయ వర్గాలు చెపుతున్నాయి.



ఎమ్మెల్యే జోగారావుతో చర్చిస్తున్న పోలింగ్ బూత్ ఏజెంట్లు

నియోజకవర్గ నాయకులతో ముమ్మరంగా చర్చలు



టిడిపి అభ్యర్థి విజయచంద్రను కలుసుకున్న పోలింగ్ బూత్ ఏజెంట్లు


వంతెన పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న చిట్టిగెడ్డ

అకాల వర్షానికి చిట్టిగెడ్డ ఉధృతి

గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి చిట్టి గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో గిరిజన గ్రామాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మార్కొండ పుట్టి సమీపంలో ఉన్న నంద రహదారికి వెళ్లే మార్గంలో వంతెన మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 12 గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. నంద, మార్కొండ పుట్టి, సాలూరు మండలం తొండ పంచాయతీల గిరిజనప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వర్షాకాలంలో అవస్థలు తప్పడం లేదని ఈ ప్రాంత గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

నేటి నుంచి దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మొదటి విడత దోమల మందు పిచికారీ (స్ప్రేయింగ్) బుధవారం నుంచి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి తెలిపారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి మంగళవారం జూమ్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయపార్వతి మాట్లాడుతూ ఈనెల 15నుంచి మలేరియా ప్రభావిత గ్రామాల్లో దోమల నివారణా మందు ఇంటింటికీ స్ప్రేయింగ్ చేయించడం జరుగుతుందని వచ్చే నెలాఖరు వరకు ఇది కొనసాగుతుందని అన్నారు. స్ప్రేయింగ్ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు చొరవ తీసుకొని సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ ఆయా గ్రామాల్లో శత శాతం స్ప్రేయింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు స్ప్రేయింగ్ నిర్వహణపై కనీసం రెండు, మూడు రోజులు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. స్ప్రేయింగ్ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి డిఎంఒ. డాక్టర్ టి.జగన్ మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో స్ప్రేయింగ్ కోసం ఎంపికైన 401 గ్రామాల్లో మొదటి విడత ప్రణాళిక ప్రకారం ఇంటింటికీ ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో మలేరియా నియంత్రణకు కృషి చేయాలన్నారు.

సీతంపేట : ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో బుధవారం నుంచి జూన్ 5 వరకు సింథటిక్ పైరిత్రైడ్ పిచికారీ చేస్తున్నట్లు సబ్ యూనిట్ అధికారి ఎం.మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సీజన్‌ను దృష్టి అన్ని గ్రామాల్లో మలాథియన్ స్ప్రేయింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ముందుగా హైరిస్క్ గ్రామాల్లో పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్ఒ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం

మీడియాకు సకాలంలో ఇవ్వని పోలింగ్ వివరాలు

ప్రజాశక్తి - సాలూరు

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ నుంచి పోలింగ్ వరకు సమాచారాన్ని మీడియాకు సకాలంలో ఇవ్వడంలో స్థానిక ఆర్వో కార్యాలయం సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆర్వో విష్ణు చరణ్ చురుకైన అధికారి అయినప్పటికీ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహశీల్దార్ ఎ.సింహాచలం బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్యాలయంలో ఏ సమాచారాన్ని మీడియా ప్రతినిధులు అడిగినా అందించే నాధుడు కరువయ్యారు. సహాయ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న తహశీల్దార్ సింహాచలం కూడా మీడియాతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కింద స్థాయి సిబ్బంది పనితీరు బాగు లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. సోమవారం పోలింగ్ శాతం సమాచారం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొన్ని గ్రామాల్లో పోలింగ్ మందకొడిగా సాగడంతో సమాచారం ఆలస్యంగా చేరి వుండొచ్చు. మంగళవారం కూడా మండలాల వారీగా పోలైన ఓట్లు వివరాలు ఇవ్వలేదు. తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది అందుబాటులో లేకపోవడం, సెల్ ఫోన్లు స్విచ్చాఫ్ చేయడం, రింగ్ అయినా లిఫ్ట్ చేయకపోవడంతో పూర్తిస్థాయిలో మీడియాకుసమాచారం అందలేదు. అన్ని నియోజకవర్గాలు పూర్తి స్థాయి సమాచారం అందుబాటులోకి వచ్చినా ఇక్కడి నియోజకవర్గ సమాచారం అందలేదు. దీంతో మీడియా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

14 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంతోని తెట్టంగిలో సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏర్పడిన ఘర్షణలో ఈ గ్రామానికి చెందిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎస్‌కె ఫక్రుద్దీన్ మంగళవారం తెలిపారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ ధన్యవాదాలు

ప్రజాశక్తి - కురుపాం

ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి గెలుపుకు గత నెల రోజులు కష్టపడి పనిచేసిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్ అన్నారు. మంగళవారం కురుపాం కోటలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలకు కష్టనష్టాల్లో అండగా ఉంటూ అందుబాటులో ఉంటానని ధైర్యాన్నిచ్చి ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా తక్షణమే తనను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరికి, వీరేష్ చంద్రదేవ్‌కు పలువురు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

నిబంధనలను ఉల్లంఘిస్తూ మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంటలో నిబంధనలను ఉల్లంఘించి వైన్ షాప్ బయట అమ్మకాలు చేయడం పట్ల స్థానికులు ఆందోళన చేపట్టారు. అంతేకాక ధరలు పెంచి బయట అమ్ముతున్నారని ఆందోళ చేస్తున్న ప్రజలు నిర్వాహకులతో ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు సంఘటనా స్థలానికి వెళ్లి ఎటువంటి గొడవలు లేకుండా స్థానికులు అక్కడ నుంచి పంపేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అక్రమ మద్యం అమ్మకాలపై జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మద్యం ధరలు పెరగడంతో పేదలు నాటు సారా తాగి ఆరోగ్యం పోగొట్టుకొని తమ ప్రాణాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో వైన్ షాపులో ఉన్నటువంటి సిబ్బంది ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘించి బయట అమ్ముతున్నారని ఆరోపణపై విచారణ జరపాలని చర్యలు తీసుకోవాలని కోరారు.


మద్యం దుకాణం వద్ద మాట్లాడుతున్న ఈశ్వరరావు

పన్నుల్లో ఫస్ట్...సేవల్లో లాస్ట్

ఇదీ పాలకొండ నగరపంచాయతీ తీరు

ప్రజాశక్తి-పాలకొండ

గతంలో మేజర్ పంచాయితీగా ఉన్న పాలకొండను 2013లో నగరపంచాయతీగా మార్చారు. నగరపంచాయితీగా మారిస్తే పన్నుల బాదుడు ఎక్కువగా ఉంటుందని, ఎటువంటి అభివృద్ధి లేని పాలకొండ పట్టణాన్ని నగరపంచాయతీగా మార్చడం వల్ల ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం పెరగడం తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదని అప్పట్లో ఈ మార్పును సిపిఎం, సిపిఐ వామపక్షాలు, మేధావులు, వివిధ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ ఇవన్నీ బేఖాతరు చేస్తూ అప్పటి ప్రభుత్వం పాలకొండ మేజర్ పంచాయతీని నగర పంచాయితీగా మారుస్తూ తీర్మానం చేశారు. నగరపంచాయుతీగా మారితే పన్నుల పోటు అధికంగా ఉంటుందని ప్రజల్లో ఉన్న భావన నిజమవ్వడానికి ఎంతో కాలం పట్టలేదు.

పాలకొండ పట్టణాన్ని ఆరు జోన్లుగా విభజిస్తూ బాదుడు షురూ చేశారు. మేజర్ పంచాయతీ కాలంలో వందల్లో చెల్లించిన పన్నులు వేలల్లోకి మార్చారు. దీనిపై వామపక్షాలు, ప్రజా సంఘాలు తీవ్ర నిరసనలు చేశాయి. కానీ పెంపుదల మాత్రం ఆగలేదు. ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద నగరమైన విశాఖపట్నంతో పన్నుల బాదుడుతో పాలకొండ పోటీ పడుతుందని, వాస్తవంగా చెప్పాలంటే విశాఖపట్నం కంటే కూడా పాలకొండలో పన్నులు ఎక్కువని ప్రజల్లో ఒక ఆవేదన ఉంది. పట్టణంలో పన్ను వసూళ్లలో జనరల్ టాక్స్, లైబ్రరీ టాక్స్, మురుగు టాక్స్, లైటింగ్ టాక్స్, వాటర్ టాక్స్, డ్రైనేజీ టాక్స్ ఇలా అన్ని రకాల పన్నులు కలిపి


కొత్త వీధిలో రోడ్డుపై నిల్వ ఉన్న చెత్త

రూ.కోటీ 70లక్షల వరకు ఆస్తి పన్నులు వసూలు చేస్తున్నారు. పన్నుల వసూళ్లలో ప్రయివేట్ ఏజెంట్ల మాదిరి వ్యవహరిస్తున్నారనే అపవాదం మూట కట్టుకున్నారని ప్రజలే చర్చించుకుంటున్నారు. జనవరి నుంచి సచివాలయ ఉద్యోగులు పెండింగ్ పన్నుల వసూలు కోసం రోడ్డు ఎక్కి ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేసే బాధ్యత తీసుకుంటున్నారని చెప్పొచ్చు. పన్నుల వసూళ్లలో ఇంత శ్రద్ధ చూపినందుకు గతంలో పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది పాలకొండ నగరపంచాయితీ. గత ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లలో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో పాలకొండ నిలవడం గొప్పగా చెప్పుకుంటున్నారు. అలా అని అభివృద్ధిలో, మౌలిక సదుపాయాల విషయంలో రాష్ట్రంలో పాలకొండ నగరపంచాయతీ స్థానం ఎక్కడ అంటే చెప్పలేని పరిస్థితి. నగరపంచాయితీగా మారిన తర్వాత పాలకొండ రూపురేఖలు ఏమైనా మారిపోయాయా అంటే అలా కూడా జరగలేదు. పారిశుధ్యం విషయంలో చాలా అధ్వాన్నంగా ఉంది ఇక్కడి పరిస్థితి. రాష్ట్రంలోనే పన్ను వసూళ్లలో ప్రథమ స్థానంలో నిలిచిన పాలకొండ నగరపంచాయితీకి శాశ్వత డంపింగ్ యార్డ్ అనేదే లేదు. గతంలో తాత్కాలిక డంపింగ్ యార్డుగా కొత్తవీధి పరిసరాల్లో ఉన్న చెరువు దగ్గర స్థలాన్ని గుర్తించి అక్కడ చెత్త వేస్తున్నారు. మొదట్లో ఇక్కడ చెత్త వెయ్యకండి అని అడ్డు చెప్పిన స్థానికులను ఈ డంపింగ్ యార్డ్ తాత్కాలికమే. కొన్ని నెలల్లోనే ఇక్కడి నుంచి డంపింగ్ యార్డ్ తరలిస్తామని హామీ ఇచ్చి ఒప్పించారు. కార్యాచరణకు వచ్చేసరికి నెలలు కాస్త సంవత్సరాలు గడిచిపోయాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం ఇంతవరకు చూపలేదు.

ఇక లైబ్రరీ టాక్స్ విషయానికొస్తే పట్టణంలోని లైబ్రరీ నగరపంచాయితీ ఎదురుగానే ఉంది. అక్కడకు వెళ్లటానికి కూడా సరైన రహదారి లేదు. చుట్టుపక్కల మురుగు నీరు, చెత్తతో కలగలిసి ఉన్న లైబ్రరీని కనీసం బాగు చేసే పని కూడా చేయరు. ఈ లైబ్రరీలో ప్రతి ఏటా చదువుకునే పిల్లలకు వేసవి సెలవుల్లో డ్రాయింగ్, పెయింటింగ్ ఇలా చాలా విషయాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. కానీ చుట్టుపక్కల ఉన్న అపరిశుభ్రత వల్ల తమ పిల్లలకు ఏం రోగాలు వస్తాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని వెంకటరాయుని కోనేరును పార్కుగా తీర్చిదిద్దుతామని చెప్పిన మాటలు ప్రతి ఎన్నికల్లో హామీ రూపంలోనే ఉంటుంది. ఆచరణలోకి మాత్రం రావడం లేదు.



రైతు బజార్ శంకుస్థాపన స్థాయిలో ఉంది. ప్రధాన రహదారిని విస్తరించి సెంటర్ లైటింగ్‌తో అభివృద్ధి చేస్తామనే హామీ రోడ్డు కోసం కొలతలు వేసిన దగ్గరే ఆగిపోయింది. ఇంటింటికి కుళాయి అనే పథకం పూర్తిగా పడకేసిందనే చెప్పాలి. పట్టణంలో ప్రధాన రహదారి కాకుండా నిత్యం రద్దీగా ఉండే ముఖ్య రహదారులు మరో 5 ఉన్నాయని చెప్పవచ్చు. మార్కెట్ రోడ్డు, కోటదుర్గమ్మ ఆలయం వెనక నుంచి లంబూరు వరకు ఉన్న రహదారి, స్థానిక ఆంజనేయ సెంటర్ నుంచి వడమ వెళ్లే రహదారి, అక్కడి నుండే హాస్పిటల్‌కు వెళ్లే రహదారి, గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా దేవరపేట వైపు వెళ్లే రహదారులు ఐదు కూడా నిత్యం విపరీతమైన ట్రాఫిక్ రద్దీతో కిటకిటలాడుతాయి. పండగ సమయంలో అయితే ఇంకా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ దారుల్లో కాలువలు సరిగ్గా శుభ్రం చేయకపోవడం వల్ల వర్షం వస్తే కాలువలు పొంగి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే పట్టణంలో సమస్యలు చాలా ఉన్నాయి. పన్ను వసూళ్లలో పాలకొండను ప్రథమ స్థానంలో నిలిపిన నగరపంచాయతీ అధికారులు ఇకనైనా ప్రజా సమస్యలు పరిష్కరించి అభివృద్ధి, సేవలందించడంలో పాలకొండను పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గొల్ల వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

- సాలూరు వైపే ఇరు వర్గాల చూపు
- వైసిపి మెజారిటీపై తగ్గనున్న 'మక్కువ'

ప్రజాశక్తి - మక్కువ

సాలూరు నియోజకవర్గంలో ఇరు పార్టీల్లోనూ గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వైసిపి అభ్యర్థి పీడిక రాజన్నదొర ఐదోసారి గెలుపు కోసం, టిడిపి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి మొదటిసారి గెలుపు కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో ఒకప్పుడు వైసిపి గెలుపునల్లేరు మీద నడకే అన్న రీతిలో ఉండేది. కానీ ఈసారి ఎన్నికల్లో ఆ రకమైన వాదనకు ఆస్కారం లేకుండా పొందని పలువుల అభిప్రాయపడుతున్నారు. తెలుగుదేశం పార్టీ గ్రూపులు ఉన్నప్పటికీ మెంటాడ, పాచిపెంట, సాలూరు రూరల్‌లో ఒకింత ఆ పార్టీ పైస్థాయి సాధిస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు మక్కువ మండలం వైసిపికి అత్యధిక మెజార్టీ తెచ్చే మండలంగా గతంలో కొనసాగ్గా ఈ దఫా ఆ మెజారిటీ కాస్త తగ్గుతాదన్న ప్రచారం జోరుగా సాగుతోంది. వైసిపి మెజారిటీ తగ్గించడంలో టిడిపి శ్రేణులు చేరికలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగారు. మండల కేంద్రంలో ఇప్పుడు మెజార్టీ తగ్గి టిడిపి. వైసిపి ఓట్లను చీల్చుకున్నాయన్న ప్రచారం జరుగుతుంది. ఇక్కడ కొన్ని కులాలు ఈ దఫా టిడిపికి లోపల ఓటింగ్ రూపంలో మద్దతు పలికినట్లు సమాచారం. ఈసారి మక్కువ మండలంలో వైసీపీ పార్టీకి గత ఎన్నికల కంటే రెండు నుంచి మూడు వేలు మెజారిటీ తగ్గే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. మరోవైపు టిడిపిలో గ్రూపుల కారణంగా ఒక గ్రూపు లోపాకారిగా వైసిపికి ఓటింగ్ సహకరించిందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతుంది. ఇది ఇలా ఉంటే సాలూరు పట్టణంపై ప్రస్తుతం ఇరు పార్టీలు గెలుపు ఓటమిల ఆధారపడి ఉన్నట్లు తెలుస్తోంది. గతం కంటే పట్టణ ఓటర్లు సంధ్యారాణిపై సానుభూతి కనబర్చారన్న ప్రచారం కూడా సాగుతోంది. ఎగ్జిట్ పోల్స్, ఇంటిలిజెన్స్ సమాచారాల మేరకు గెలుపుతో ఎవరు దీమాలో వారు ఉన్నారని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు

మున్సిపాలిటీలో వైసిపి వెనుకంజ

- కొరవడి సమర్థ నాయకత్వం
- టిడిపికి అండగా నిలుస్తున్న పట్టణ ఓటర్లు

ప్రజాశక్తి - సాలూరు

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మున్సిపాల్టీలో అధికార పార్టీ మరోసారి వెనుకంజలో ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. సోమవారం జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే పట్టణంలో మళ్లీ అధికారపార్టీ నాయకులు పేలవమైన పాత్ర పోషించారనే వాదనలు వినిపిస్తున్నాయి. గత మూడు ఎన్నికల్లోనూ వైసిపికి పట్టణంలో ఆధిక్యత దక్కలేదు. 2009, 2014, 2019 ఎన్నికల్లో పట్టణ ఓటర్లు టిడిపికి ఆధిక్యత ఇచ్చారు. ఈసారి ఎన్నికల్లోనూ టిడిపికే పట్టణ ప్రజలు ఆధిక్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈసారి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సంధ్యారాణికి భారీ ఆధిక్యత లభిస్తుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావంతో ఉన్నారు. సుమారు 10వేల మెజారిటీ వస్తుందని అంచనాలు వేస్తున్నారు. అయితే అంత మెజారిటీ టిడిపికి దక్కడం అసంభవమని అధికారపార్టీ నాయకులు వాదిస్తున్నారు. ఐదు వేలకు మించి ఆధిక్యత టిడిపికి రాదని వారు అభిప్రాయపడుతున్నారు. ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కోరుతూ టిడిపి సంధ్యారాణి చేసిన ప్రచారం కొంతవరకు ఆమెకు ఓట్లు పొందడానికి దోహదపడింది. ఆమెకు పట్టణంలో మాత్రమే సానుభూతి పవనాలు బలంగా వీచాయనే వాదనలు వినిపిస్తున్నాయి. టిడిపి ఈసారి ఎన్నికల్లోనూ ఆధిక్యత పొందడానికి బలమైన కారణాలు వున్నాయి. పట్టణంలో వైసిపికి సమర్థవంతమైన నాయకత్వ లేమి, డిప్యూటీ సీఎం రాజన్నదొర పూర్తి స్థాయిలో పట్టణపాలనపై దృష్టి సారించక పోవడం వంటి అంశాలు పట్టణంలో పార్టీని మరోసారి వెనుకంజలో నిలబెట్టడానికి కారణమయ్యాయి. పట్టణంలో వైసిపి పాలకవర్గం ఉన్నా పురపాలనపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం చేయడం, పాలకవర్గ సభ్యుల మధ్య గ్రూపు రాజకీయాలు కూడా పార్టీపై ప్రతికూల ప్రభావం చూపినట్లు కనిపిస్తోంది. ఛైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ భర్త నాగేశ్వరరావు అనారోగ్యానికి గురి కావడంతో పురపాలన కొంతవరకు గాడి తప్పింది. ఆమె కుమారుడు పాలనా వ్యవహారాలు చూస్తున్నా పట్టణ నాయకత్వం వహించే స్థాయికి ఆయన ఎదగలేదు. పట్టణ పార్టీలో బహు నాయకత్వం వల్ల ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించలేని పరిస్థితి ఏర్పడింది. సోమవారం జరిగిన పోలింగ్ లో పట్టణంలో మొత్తం 28,000 ఓట్లు పోలయ్యాయి. సుమారు 40వేలు ఓట్లు వున్నాయి. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాజన్నదొర పట్టణంలో పార్టీని ప్రక్షాళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుసగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణానికి సంబంధించి ప్రతికూల ఫలితాలు రావడం నాయకత్వ లోపాన్ని ఎత్తి చూపిస్తోంది. పట్టణ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, కీలక పదవుల్లో ఉన్న నాయకుల పోలింగ్ కేంద్రాల్లో ఈసారి కూడా రాజన్నదొరకు ఆధిక్యత లభించిందనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఇరువురిలోనూ కలవరం

- చీపురుపల్లిలో అంతు చిక్కని పోలింగ్ సరళి
- పింఛనర్లు, మహిళా ఓటర్లపై అధికార పార్టీ ధీమా
- యువ ఓటర్లు, 'సూపర్ సిక్స్' పై టిడిపి ఆశలు
- గతం కంటే పెరిగిన పోలింగ్ శాతం

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి నియోజకవర్గంలో ఓటర్ నాడి అంతు చిక్కడం లేదు. గతంలో కన్నా పోలింగ్ అధికంగా నమోదు కావడం, మహిళా ఓట్లు, యువ ఓటర్ల పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం వంటి పరిణామాలతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గతం కంటే పోలింగ్ శాతం పెరగడంతో ఎన్నికల ఫలితాలు ఎవరికి అనుకూలంగా ఉంటాయన్న అంశంపై నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. పోలింగ్‌లో సాగిన తీరును ప్రధాన పార్టీ అభ్యర్థులు తమకు అనుకూలంగా అన్వయించుకుంటూ విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. 2004, 2009, 2019లలో మూడు సార్లు చీపురుపల్లి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన తాజా మంత్రి బొత్స సత్యనారాయణ నాలుగోసారి కూడా తన గెలుపు ఖాయమని మొదటి నుంచి నమ్మకంతో ఉన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో కూటమిదే విజయమని కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలతో పాటు నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధే తనను గెలుపిస్తుందని బొత్స సత్యనారాయణ ధీమాగా ఉన్నారు. కేంద్రంలో మోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, టిడిపి, బిజెపి, జనసేన ప్రవేశ పెట్టిన ఉమ్మడి మేనిఫెస్టులోని సూపర్‌సిక్స్ పథకాలు, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రభుత్వ అనుకూల ఓట్లలో చీలిక వచ్చిందని, ముఖ్యంగా యువత, ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్గాలు తమకు అనుకూలంగా ఓటు వేసారనే నమ్మకం వంటివి తమకు లాభం చేకూరుస్తాయని టిడిపి అభ్యర్థి కళావెంకటరావు నమ్మకంతో ఉన్నారు.





పెరిగిన పోలింగ్ శాతం

నియోజకవర్గంలో 2019లో 80 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ సారి అది పెరిగి 83.48 శాతం కావడంతో కూటమి పార్టీ కాస్త ధీమాగా ఉండడమే కాకుండా పెరిగిన పర్సంటేజి తమకు కలిసి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తోంది. నియోజకవర్గంలో 2,05,484 మంది ఓటర్లుండగా 1,71,533 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నారు. గత ఎన్నికల కంటే ప్రస్తుత ఎన్నికలలో 3.48 శాతం మంది ఓటర్లు అదనంగా తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో గతంకంటే భిన్న పరిస్థితులు ఏర్పడడం వల్ల టిడిపికి అనుకూలంగా ఉంటుదని ఆ పార్టీ అభ్యర్థి కిమిడి కళావెంకటరావు, తాను చేసిన అబివృద్ధే తనను గెలిపిస్తుందని బొత్స సత్యన్నారాయణలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరు చీపురుపల్లి ఎమ్మెల్యే పీఠాన్ని అదిరోహిస్తారో జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

పార్టీ కార్యాలయాల్లో బిజీ బిజీ

గుర్ల: టిడిపి, వైసిపి కార్యకర్తలు, నాయకులు మంగళవారం పార్టీ కార్యాలయాలలో బిజీ బిజీగా కనిపించారు. సోమవారం పోలింగ్ ముగియడంతో మొత్తం పోలైన ఓట్లులో తమ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి అని లెక్కలు వేసుకొని తమ అంచనాలపై చర్చించుకుంటున్నారు. 2019 సాధారణ ఎన్నికలలో గుర్ల మండలం నుంచి వైసిపికి 6,500 పైగా మెజారిటీ వచ్చింది. 2019 సాధారణ ఎన్నికలు మినహా గతంలో జరిగిన ఎన్నికలలో టిడిపికి ఎప్పుడూ మెజారిటీ వచ్చేది. ప్రస్తుతం జరిగిన ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకత వల్ల టిడిపికి 2వేల ఓట్లు మెజారిటీ వస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు వల్ల తమ పార్టీకి గతంలో వచ్చిన మెజారిటికి వెయ్యి ఓట్లు అటుఇటుగా మెజారిటి వస్తుందని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి. ఈ లెక్కలతో పాటు గ్రామాలలో మధ్యస్తంగా ఉన్న ఓట్లు ఏ పార్టీకి ఎక్కువగా వస్తే వారిదే మెజారిటి అని రాజకీయా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరువర్గాలు ఓట్లు కోసం డబ్బులు, మద్యంను అందించి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇరు పార్టీలు నాయకులూ కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేశారు. ప్రధానంగా వలస ఓటర్లును రపించడంలో గ్రామస్థాయి నాయకులు ఎక్కువ శ్రద్ధ కనబరిచారు. మంగళవారం ఉదయం నుంచి నియోజకవర్గ కేంద్రంలో కార్యకర్తలు తమ అభ్యర్థులకు ఓట్లు పోలింగ్ శాతంపై తమ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయన్న లెక్కలను వివరించారు.

పెరిగిన పోలింగ్..అభ్యర్థుల్లో టెన్షన్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది. ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు గంటల తరబడి క్యూలో ఉండి ఓట్లు వేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో రాత్రి 8గంటల వరకు క్యూలో ఉండి ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటర్లు కసితో ఓటు వేశారని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేయగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి మద్దతుగా ఓట్లు వేశారని వైసిపి నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు ఎవరు పక్షాన తీర్పు ఇచ్చారో జూన్ 4న తేలనుంది.

బొబ్బిలిలో 80.34శాతం పోలింగ్

నియోజకవర్గంలో 80.34 శాతం పోలింగ్ అయింది. నియోజకవర్గంలో 2,31,232 మంది ఓటర్లు ఉండగా 1,85,774 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. బొబ్బిలి పట్టణం, మండలంలో 1,03,78 మంది ఓటర్లకు 81,282 మంది, బాడంగి మండలంలో 39,691మందికి, 32,508 మంది, రామభద్రపురం మండలంలో 38,371మందికి 32,135మంది, తెర్లాం మండలంలో 49,792మందికి 39,850మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

తరలి వచ్చిన వలస ఓటర్లు

ఓటుహక్కును వినియోగించుకునేందుకు వలస ఓటర్లు తరలి వచ్చారు. ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఓటు వేసేందుకు సొంత గ్రామాలకు చేరుకున్నారు. వలస కార్మికులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసినట్లు చర్చ జరుగుంది. నియోజకవర్గంలో మహిళలు ఓటింగ్ శాతం ఎక్కువ ఉంది. పెరిగిన మహిళ ఓటింగ్ వైసిపికి


కార్యకర్తలు, నాయకులతో చర్చిస్తున్న బేబినాయన

అనుకూలంగా ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగ యువత, వలస కార్మికులు ఓట్లు వేయగా సంక్షేమ పథకాలకు మద్దతుగా మహిళలు ఓట్లు వేసినట్లు చర్చ జరుగుతుంది.

విజయం ఎవరిని వరిస్తుందో

నియోజకవర్గంలో ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి అభ్యర్థులు మధ్య పోటీ ఉంటుంది. 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి తెంటు రాజాకు 76,629 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థి సుజయకృష్ణ రంగారావుకు 83,587 ఓట్లు వచ్చి సుజయకృష్ణ రంగారావు 6,958 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు 84,955 ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి సుజయకృష్ణ రంగారావుకు 76,603 ఓట్లు వచ్చి వైసిపి అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు 8,352ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు పడి కూటమికి అనుకూలంగా ఉంటుందని చర్చ జరుగుతుంది. నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారో జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

బొబ్బిలిలో బేబినాయన విజయం ఖాయం

నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి బేబినాయన విజయం ఖాయమని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు అన్నారు. కోటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సమయంలో మంచి స్పందన లభించిందన్నారు. ప్రజల ఆదరణ మరువలేనిదని చెప్పారు. బేబినాయనపై ప్రజలకు మంచి నమ్మకం కనిపిస్తుందని చెప్పారు. జూన్ 4న వెలువడనున్న ఫలితాల్లో ఎమ్మెల్యేగా బేబినాయన, ఎమ్‌పిగా కలిశెట్టి అప్పలనాయుడు అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని చెప్పారు.

కోటకు పోటెత్తిన టిడిపి కార్యకర్తలు

కోటకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రక్రియను వివరించేందుకు ఉమ్మడి అభ్యర్థి బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావును కలిశారు. పోలింగ్‌లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా టిడిపికి ప్రజలు ఓట్లు వేశారని వారంతా చెప్పారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో టిడిపి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందని కూటమి నాయకులు, కార్యకర్తలు చెప్పారు. ఈ సందర్భంగా కూటమికి మద్దతుగా పని చేసిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు బేబినాయన, సుజయనాయన అభినందనలు చెప్పారు.